సాక్షి ఒడిశా

బుధవారం । 10 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,20,805 లు. బంగారం 650 మిల్లీ గ్రాములు.వెండి 9 గ్రాముల 500 మిల్లీ గ్రాములువచ్చాయని అధికారులు వెల్లడించారు.



రథయాత్రకు సన్నాహాలు

- 8లో

మాతార దేవి ఉత్సవాలు ప్రారంభం

బరంపురం: నగరానికి సమీపంలోని లంజిపల్లె గ్రామంలో మాతార దేవి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు స్థానిక ఆలయంలో కొలువై ఉన్న అమ్మవారికి పూజా కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోకి ఆహ్వానించారు. అమ్మవారి అనుగ్రహంతో అఖండ జ్యోతి వెలిగించి. గ్రామంలో నిర్మించిన తాత్కాలిక ఆలయంలో అమ్మవారిని ఉంచారు. సంబరాలు ఈనెల 29వ తేదీ వరకు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలియజేశారు.

న్యూస్‌రీల్

విద్యార్థిని కుటుంబానికి పరిహారం



బాధిత కుటుంబానికి పరిహారం అందజేస్తున్న దృశ్యం

జయపురం: ఒక వ్యక్తి ప్రేమిస్తున్నానని వేధించడంతో నిరాకరించగా, పెట్రోల్ వేసి తగలబెట్టడంతో మరణించిన ఇంజినీరింగ్ విద్యార్థిని కుటుంబానికి రూ.2.5 లక్షల పరిహారాన్ని కొరాపుట్ జిల్లా న్యాయసేవా ప్రాధికరణ జయపురం కార్యదర్శి సుమన్ జెన మంగళవారం అందించారు. ఈ సందర్భంగా సుమన్ జెన మాట్లాడుతూ.. విద్యార్థిని సెమిలిగుడలోని ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతూ, సెమిలిగుడలోనే ఒక ఇంటిలో అద్దెకు ఉంటుందేది. ఆమెను గోపీ ఖెముండు అనే యువకుడు ప్రేమిస్తున్నాని వెంటపడేవాడు. దీనికి ఆమె నిరాకరించడంతో ఆమె ఉంటున్న ఇంటికి వెళ్లి పెట్రోలు పోసి తగలబెట్టాడని తెలియజేశారు. వెంటనే ఆ ఇంటి యజమాని తీవ్రంగా గాయపడిన విద్యార్థినిని కొరాపుట్ ఆస్పత్రిలో చేర్చాడు. అనంతరం ఆమెను మెరుగైన చికిత్స కోసం బరంపురం, అనంతరం భువనేశ్వర్‌కు తరలించారు. అక్కడ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ విద్యార్థిని మరణించింది. దీంతో బాధిత కుటుంబానికి విజ్ఞప్తి మేరకు రూ.2.5 లక్షల సాయం న్యాయసేవా ప్రాధికరణ సంస్థ అందించిందని వెల్లడించారు.

ఆకట్టుకున్న నాటక మహోత్సవాలు



దేశభక్తి నాటిక ప్రదర్శిస్తున్న దృశ్యం

బరంపురం: స్థానిక హిల్‌పట్నా రోడ్‌లో ఉన్న బిజు పట్నాయక్ సాంస్కృతిక భవనంలో ఒడిశా నాటక సమరోహ సాహిత్య సమితి ఆధ్వర్యంలో 11వ జాతీయ స్థాయి నాటక మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గంజాం హోటల్స్ సంఘం అధ్యక్షుడు ఉమా పాణిగ్రహి హాజరై ప్రారంభించారు. బీడీఏ మాజీ చైర్మన్ సుభాష్ మహరణా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ బరంపురం నగరంలో జాతీయ స్థాయి నాటక మహోత్సవాలు ప్రదర్శించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈనెల 17వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని వెల్లడంచారు. కార్యక్రమంలో కార్యదర్శి మిహర్ త్రిపాఠీ, రబి బెహరా, తిరుపతి నాయక్, రామేష్ సాహు, సత్యబ్రాత దాస్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం నవీన్‌తో నితీష్ కుమార్ భేటీ

- గంటకు పైగా సుదీర్ఘ సమావేశం
- రాజకీయ చర్చలు జరగలేదని ఇరువురి సీఎంల ప్రకటన
- స్నేహపూర్వకంగానే కలిశామని వెల్లడి



సీఎం నవీన్ నివాస్‌లో ఇరువురు ముఖ్యమంత్రుల మధ్య కొనసాగుతున్న చర్చ

భువనేశ్వర్: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మంగళవారం జేడీ(యూ) జాతీయ అధ్యక్షుడు రాజీవ్ రంజన్, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ ఝాతో కలిసి రాష్ట్రానికి విచ్చేశారు. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నితీష్‌కుమార్ నేరుగా నవీన్ నివాస్‌కు చేరుకున్నారు. ఇరువురి మధ్య దాదాపు గంటకు పైగా సుదీర్ఘ చర్చ సాగింది. భేటీ అనంతరం ఇరువురు ముఖ్యమంత్రులు మీడియాతో మాట్లాడారు. నితీష్ జీ భువనేశ్వర్ వచ్చినందుకు సంతోషిస్తున్నాను. మేము పాత స్నేహితులం. అనేక విషయాలను చర్చించామని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తెలిపారు. బీహార్ నుంచి విచ్చేసే యాత్రికులు, పర్యాటకులు బస చేయడానికి పూరీలో ఒకటిన్నర ఎకరాల విస్తీర్ణపు స్థలాన్ని బీహార్ ప్రభుత్వానికి గెస్ట్ హౌస్ కోసం ఉచితంగా మంజూరు చేయాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించారు. ఈ ప్రకటనపై బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నవీన్ పట్నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయ పొత్తులపై ఎలాంటి చర్చ జరగలేదని నవీన పట్నాయక్ ఉద్ఘాటించారు. అనంతరం నితీష్ కుమార్ మాట్లాడుతూ.. తన పాత స్నేహితుడిని కలవడానికి వచ్చినట్లు వెల్లడించారు. చాలా రోజుల తర్వాత కలవడం సంతోషంగా ఉందన్నారు.

మహా ప్రతిపక్ష కూటమి లక్ష్యంగా..?

బీజేపీకి వ్యతిరేకంగా మహా ప్రతిపక్ష కూటమిని ఏర్పాటు చేసేందుకు, ప్రతిపక్ష నేతలను ఉమ్మడి వేదికపైకి తీసుకొచ్చేందుకు బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కృషి చేస్తున్నట్లు జాతీయ స్థాయిలో ప్రచారం సాగుతుంది. ఎన్డీయేతర పార్టీలన్నింటినీ ఏకతాటిపైకి తీసుకురావడమే ఆయన లక్ష్యంగా తెలుస్తోంది. అయితే బీజేపీ మరియు కాంగ్రెస్ వర్గాలతో బీజేడీ సమాన దూరాన్ని కొనసాగిస్తోంది. తృతీయ కూటమి ఏర్పాటు నేపథ్యంలో బీజేడీ ఆది నుంచి ఇదే వైఖరి ప్రదర్శించి, 2019 సంవత్సరం నుంచి వరుసగా ఏర్పాటైన అన్ని సమావేశాల్లో దాటవేత వైఖరితో తప్పించుకుని చలామణి అవుతోంది. తృతీయ కూటమి ఆవిర్భావంలో నవీన్ విభిన్నమైన నానుడితో దాటవేస్తున్నారు. లోగడ అధికార బీజేపీ, విపక్ష కాంగ్రెసు నుంచి సమాన దూరంలో ఉంటున్నందున తృతీయ కూటమిపై ఆసక్తి లేనట్లు ప్రకటించారు. రాష్ట్రంలో ఇటీవల బీజేపీ, బీజేడీ మధ్య వైరిభావాలు దాదాపు తారాస్థాయికి చేరాయి. అయినప్పటికీ ఆయన వైఖరి ఆంతర్యం బయట పడనీయకుండా జాగ్రత్త వహిస్తున్నారు.

స్థలం కేటాయింపునకే చర్చలా..!

తృతీయ కూటమి వారధులుగా చలామణి అవుతున్న నితీష్ కుమార్, మమత బెనర్జీలు ఇటీవల సీఎం నవీన్ పట్నాయక్‌తో కలిసిన సందర్భంగా పూరీ శ్రీజగన్నాథుని క్షేత్రంలో పశ్చిమ బెంగాలు, బీహారు ప్రాంతాల నుంచి విచ్చేసే యాత్రికులు, పర్యాటకులు బస చేసేందుకు ప్రత్యేక భవనాల కోసం స్థలం కేటాయింపు కోసం చర్చలు పరిమితం అయినట్లు ప్రకటించారు. ఈ ఏడాది మార్చి నెలలో మమతా బెనర్జీ, తాజాగా నితీష్ కుమార్ పర్యటన పురస్కరించుకొని ఆయా రాష్ట్రాల భవనాల నిర్మాణానికి స్థలం కేటాయించినట్లు ప్రకటించడంతో చర్చలు ముగిసినట్లు ప్రకటించడం విశేషం. ఈ వైఖరితో ఇరుగు, పొరుగు రాష్ట్రాలైన పశ్చిమ బెంగాలు, బీహారు రాష్ట్రాలతో మైత్రి బంధం బలపడుతుందని నవీన్ పట్నాయక్ అంటున్నారు. కానీ రానున్న ఎన్నికల్లో జాతీయ స్థాయిలో కూటమి ఏర్పాటుపైనే చర్చలు జరిగినట్లు తెలుస్తోంది.

గజపతిలో కార్తికేయ పాండియన్ పర్యటన



బిజు ఎక్స్‌ప్రెస్ వే ప్లాన్ పరిశీలిస్తున్న కార్తికేయ పాండియన్

- మోహనాలో రోడ్డు పనులకు శంకుస్థాపన

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా నియోజకవర్గంలో రాష్ట్ర 5టీ ముఖ్య కార్యదర్శి వి.కార్తికేయ పాండియన్ మంగళవారం పర్యటించారు. అక్కడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో హెలికాప్టర్‌లో దిగి అనంతరం బహిరంగ సమావేశంలో పాల్గొన్నారు. బరంపురం నుంచి మోహనా మీదుగా మల్కన్‌గిరి - జయపురం వరకు నిర్మించే 'బిజూ ఎక్స్‌ప్రెస్ వే' రెండో దశ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిజూ ఎక్స్‌ప్రెస్ వే ద్వారా బరంపురం చేరుకోవడానికి గంట సమయం పడుతుందన్నారు. మోహనా - కొరాపుట్ - జయపురం మధ్య నాలుగు కిలోమీటర్ల టన్నల్స్ నిర్మిస్తామని, ఇకపై మల్కన్‌గిరి, భద్రాచలం, హైదరాబాద్‌కు చేరుకోవాలంటే నేరుగా మోహనా నుంచే అతి తక్కువ సమయంలో ప్రయాణించవచ్చన్నారు. రూ.4000 కోట్లతో నిర్మించనున్న హైవే కారిడర్ మూడేళ్లలో పూర్తవుతుందన్నారు. దీనివల్ల మోహనా ప్రాంతం అభివృద్ధి చెందడమే కాకుండా అనేక మందికి ఉపాధి లభిస్తుందని తెలియజేశారు. మహిళలకు వడ్డీలేని రుణాలు రూ.5 లక్షల వరకూ ఇస్తున్నామని, బిజూ స్వస్థ్య ఆరోగ్య కార్డుల ద్వారా మహిళలు రూ.10 లక్షల వరకూ కార్పొరేట్ ఆస్పత్రిలలో వైద్య సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, సహకార సంఘాల మంత్రి అతాను సవ్యసాచి నాయక్, ఎంపీ చంద్రశేఖర సాహు, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, మోహనా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, ఎస్డీసీ చైర్మన్ మరియం రైతో, తిరుపతి పాణిగ్రాహి, మోహనా నియోజకవర్గం బీజేడీ పార్టీ అధ్యక్షుడు దండాశి సాహు, కలెక్టర్ లింగరాజ్ పండా, ఎస్పీ స్వాతి ఎస్. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యటన వివరాలు

రాష్ట్ర 5టీ కార్యదర్శి కార్తికేయ పాండియన్ మంగళవారం రాత్రికి చంద్రగిరి టిబెటియన్ వసతి గృహంలో బస చేశారు. బుధవారం ఉదయం జిరంగోలో టిబెటియన్ బౌద్ధ శరణార్థులతో మాట్లాడి, తర్వాత పద్మసంభవ పార్క్, బౌద్ధుల ఆశ్రమాన్ని సందర్శిస్తారు. అనంతరం ఛెలిగడ ఇరిగేషన్ ప్రాజెక్టును సందర్శిస్తారు. పర్లాకిమిడి నియోజకవర్గం గుమ్మాలో మునిసింగి రబ్బరు పరిశ్రమను సందర్శిస్తారు.

ఎలుగుబంటి సంచారం

- భయాందోళనలో ప్రజలు



రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న ఎలుగు బంటి

జయపురం: స్థానిక విమానాశ్రయం, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ఎలుగు బంటి సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. గత శుక్రవారం నుంచి ఆయా ప్రాంతాల్లో ఎలుగుబంటి తిరుగుతోందని, శుక్రవారం రాత్రి రైల్వేస్టేషన్ కాలనీలో కనిపించిందని స్థానికులు తెలుపగా, శనివారం సాయంత్రం జయపురం విమానాశ్రయం ప్రాంతంలో కనిపించినట్లు ఆ ప్రాంత ప్రజలు తెలిపారు. గతంలో అవిభక్త కొరాపుట్ జిల్లాలో ఎలుగుబంట్లు జనావాస ప్రాంతాల్లో దాడులు జరపడంతో, స్థానిక ప్రజలు భయపడుతున్నారు. ఈ విషయంపై జయపురం అటవీ విభాగ అధికారులకు ఫిర్యాదు చేయగా, గత మూడు రోజులుగా అధికారులు ఎలుగుబంటిని పట్టుకోవడం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ఆహారం కోసం...

ఎలుగుబంటి గొడాపాదర్ సమీప అడవి నుంచి లేదా డొంగరపంశి గ్రామ సమీప అడవిలో నుంచి వచ్చుంటుందని అటవీ అధికారులు అభిప్రాయపడుతున్నారు. అడవిలో ఆహారం సక్రమంగా లభించకపోవడంతో గ్రామాల్లోకి వస్తున్నాయని పేర్కొన్నారు. శనివారం రాత్రి బంకబిజ గ్రామం సమీపంలో ఉన్న ఒక పనస చెట్టు పండ్లను తిన్నట్లు గుర్తించామని అటవీ సిబ్బంది వెల్లడించారు. ఈ ప్రాంతంలో సంచరిస్తున్న ఎలుగుబంటి మధ్య వయసు కలిగిన ఆడది అని అధికారి ప్రకాశ చంద్ర కుంటియ అంచనా వేస్తున్నారు. అలాగే జయపురం రేంజ్ అధికారి సచిదానంద పారిడ నేతృత్వంలో 30 మంది అటవీ సిబ్బంది, పారా అటవీ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారని వెల్లడించారు. ఇప్పటివరకు ఎలుగుబంటి ఎటువంటి హాని చేయలేదని, కానీ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలుగుబంటిని ఎవరు చూసినా అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కలహండి జిల్లాలో ఎదురు కాల్పులు



గాయపడిన పోలీసు అధికారిని చికిత్స కోసం తరలిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న డీజీపీ ఎస్.కె.బన్సాల్

- ముగ్గురు మావోయిస్టులు మృతి
- పోలీసు అధికారికి గాయాలు

భువనేశ్వర్: కలహండి జిల్లా మదనపూర్ - రాంపూర్ పోలీసుస్టేషన్ పరిధి తాపరంగ్ లుడెన్‌గడ్ అభయారణ్యం సమీపంలో మావోయిస్టులు, పోలీసుల మధ్య మంగళవారం ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులను భద్రతా బలగాలు హతమార్చగా, మావోల కాల్పుల్లో ఒక డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (డీఎస్పీ) గాయపడ్డారు. ఆయన కాలికి బుల్లెట్ తగిలి గాయపడ్డారు. వెంటనే పోలీసు అధికారిని చికిత్స నిమిత్తం భీమ భోయ్ వైద్య బోధన ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఉన్నత చికిత్స కోసం భువనేశ్వర్ తరలించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా డీజీపీ సునీల్ కుమార్ బన్సాల్ మాట్లాడుతూ.. ఎం.రాంపూర్ పోలీసుస్టేషన్ పరిధిలో కాల్పులు జరిగినట్లు స్పష్టం చేశారు. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. ఘటనా స్థలంలో గాలింపు చర్యలో ఒక ఏకే-47 తుపాకీ స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో సీనియర్ మావోయిస్టు కేడర్‌లు ఉండొచ్చని పేర్కొన్నారు. ఎదురుకాల్పుల్లో ఒక పోలీసు అధికారికి కూడా బుల్లెట్ గాయమైందని, అయితే అతను ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడని వెల్లడించారు. అతన్ని మెరుగైన చికిత్స కోసం భువనేశ్వర్‌కు తరలిరచినట్లు వివరించారు. ఎదురు కాల్పులు జరిగిన ప్రాంతంలో ప్రస్తుతం సోదాలు కొనసాగుతున్నాయి. నక్సల్స్ హింసాత్మక చర్యలకు దూరంగా ఉండాలని, జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని డీజీపీ మరోసారి విజ్ఞప్తి చేశారు.

బంద్ విజయవంతం

- స్తంభించిన జనజీవనం
- ఎక్కడికక్కడే నిలిచిన వాహనాలు



కొరాపుట్: జయపూర్ రోడ్డులో బైఠాయించిన కాంగ్రెస్ శ్రేణులు



జయపురం మెయిన్ రోడ్డులో మూతపడిన దుకాణాలు



మూతపడిన దైనిక బజారు



నిర్మానుష్యంగా కనిపిస్తున్న 26వ జాతీయ రహదారి

జయపురం: జయపురంలో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కొరాపుట్ జిల్లా బంద్‌కు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు జన జీవనం స్తంభించింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీనాక్షీ బాహినీపతి పిలుపుమేరకు ఉదయం 6 గంటల నుంచే బంద్ ప్రారంభమైంది. ప్రైవేటు, ప్రభుత్వ బస్సులు రోడ్డెక్కలేదు. అటు మల్కన్‌గిరి, ఇటు నవరంగపూర్, రాయగడ జిల్లాల నుంచి, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, భద్రాచలం, విజయవాడ, రాయ్‌పూర్, జగదల్‌పూర్ మొదలగు ప్రాంతాల నుంచి కొరాపుట్ జిల్లాకు వచ్చిన ప్రయాణికుల రాత్రి బస్సులు, నిత్యావసర, అత్యవసర దినుసులు, తీసుకొచ్చే ట్రక్కులు జిల్లా సరిహద్దులలోనే నిలిచిపోయాయి. బందు కారణంగా జిల్లాలో పెట్రోలు బంకులు, పాఠశాలలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, దైనిక బజారులు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి, మున్సిపల్ చైర్మన్ నరేంద్ర మహంతి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుకాంత పటాన్నయిక్, సహాయ కార్యదర్శి వెంకటరావు పటాన్నయిక్, కోశాధికారి నిహిర బిశాయి తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే బాహినీపతి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ధ్వజమెత్తారు. జయపురంలో కేంద్ర విద్యాలయం ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. అలాగే సెంట్రల్ డ్రైవింగ్ ట్రైనింగ్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందన్నారు. జిల్లాలో చదువుకున్న నిరుద్యోగులు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వ నియమం కారణంగా ఉద్యోగాలు పొందలేక పోతున్నారని, అందువలన స్థానికులకు జిల్లాలోనే ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

కమ్యూనిస్టుల ర్యాలీ

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన జిల్లా బందు పిలుపునకు కొరాపుట్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ పూర్తి మద్దతు తెలిపింది. దీనిలో భాగంగా జయపురం పట్టణంలో ర్యాలీ నిర్వహించింది. ర్యాలీలో జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి జుధిష్టర్ రౌళో, సహాయ కార్యదర్శి రామకృష్ణ దాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రమోద్ కుమార్ మహంతి పాల్గొన్నారు.

కొరాపుట్‌లో...

కొరాపుట్ జిల్లా బంద్ ప్రశాంతంగా ముగిసింది. వాస్తవానికి జయపురంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బంద్‌కు పిలుపునిచ్చారు. కానీ 14 సమితుల్లో స్థానిక నేతలు కేంద్ర ప్రభుత్వ విధానాలు స్థానికంగా నష్టం కలిగిస్తున్నాయని ఆరోపిస్తూ బంద్ నిర్వహించారు. కొరాపుట్ డివిజన్‌లో దమంజోడిలోని భారత అల్యూమినియం కేంద్రం (నాల్కో), సునాబెడాలోని హిందూస్థాన్ ఏరోనాటిక్ లిమిటెడ్ (హాల్)లలో స్థానికులకు ఉపాధి అవకాశాలు పెంచాలని కోరుతూ బంద్ చేపట్టారు. దీంతో ఆంధ్రా-ఒడిశా సరిహద్దు సుంకి వద్ద ఉదయం నుంచే వాహనాలు నిలిచిపోయాయి. అటు రాయగడ జిల్లా సరిహద్దుల వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు బైఠాయించారు. కొరాపుట్-నబరంగ్‌పూర్ జిల్లా సరిహద్దు ఇంద్రావతి నది వద్ద లారీలు నిలిచిపోయాయి. కొరాపుట్ మెయిన్ రోడ్డులో పురపాలక సంఘ ఉపాధ్యక్షుడు భగవాన్ వాహీనీ పతి బైఠాయించి ఆందోళన చేశారు.



వెలవెలబోతున్న పెట్రోలు బంక్



జాతీయ రహదారిలో అడ్డంగా పెట్టిన బస్సులు

క్లుప్తంగా

పోరాటం మరింత ఉద్ధృతం


మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సమస్యలపై స్పందించనప్పుడు పోరాటాలే శరణ్యమని, మరింత ఉద్ధృతంగా పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఉద్యోగులకు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఏపీ జేఏసీ అమరావతి మూడో దశ ఉద్యమాల ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలో విజయవాడ ప్రోగ్రాంను ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్‌తో నిర్వహిస్తామని, ఉద్యోగులంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఉద్యోగి తమ సమస్యలను 100 మందికి తెలియజేయాలని కోరారు. అన్ని ఉద్యోగ సంఘాలు ఏకతాటిపైకి వచ్చి భవిష్యత్ కార్యాచరణపై ప్రణాళిక సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర కోశాధికారి వి.వి.మురళీకృష్ణ, ఏపీ ఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి బి.వి.వి.ఎస్ రాజు, రెవెన్యూ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వేణుగోపాలరావు, రెవెన్యూ సంఘం ప్రతినిధులు జి.ఎల్.ఈ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ధర్మానను కలిసిన కమిషనర్ సిద్ధార్థ్ జైన్


మంత్రి ధర్మాన ప్రసాదరావుతో కమిషనర్

శ్రీకాకుళం రూరల్: జిల్లా పర్యటనకు వచ్చిన సర్వే, భూ రికార్డుల కమిషనర్ సిద్ధార్థ్ జైన్ రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించి భూ సర్వే విషయాలపై చర్చించారు.

డెంగీ జ్వరాలపై అప్రమత్తం


మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: డెంగీ, మలేరియా జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 16న జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, డీపీఓ సమన్వయంతో మెలిగి కాలువల్లో అడ్డు లేకుండా చేయాలన్నారు. మూడు వేల పాఠశాలలకు దోమతెరలు సరఫరా చేయాలని డీఎంఓను ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇరుకు వీధులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జ్వరపీడితుల రక్తనమూనాలు పరీక్షించాలన్నారు. సీహెచ్‌సీ, జీజీహెచ్ పరిధిలో మలేరియా, డెంగీ కేసులు నమోదు కాకుండా చూసుకోవాలన్నారు. పారిశుద్ధ్య సిబ్బందితో యాంటీ లార్వా స్ప్రే చేయించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం గ్రామాల్లో డ్రై డే నిర్వహించాలని సూచించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మీనాక్షి, డీఎంఓ సత్యనారాయణ మాట్లాడుతూ మలేరియా, డెంగీ పరీక్షలకు ర్యాపిడ్ కిట్స్ సరఫరా చేసినట్లు వివరించారు. సమావేశంలో మత్స్య శాఖ జేడీ శ్రీనివాసరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ జి.జయదేవి, జెడ్పీ సీఈఓ వెంకటరామన్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు ఇ.అనూరాధ, గడ్డెమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసాదరావు, అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ అనూరాధ, పరిశ్రమల శాఖ ఏడీ ఆర్.వి.రమణారావు, యూపీహెచ్‌సీ వైద్యాధికారి జె.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వేచ్ఛావతి సంబరాలు


అమ్మవారి ప్రతిమను మోస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు గ్రామదేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రథయాత్రకు సన్నాహాలు


జయపురం: రథయాత్ర సన్నాహక సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: శ్రీజగన్నాథుడి రథయాత్రకు సన్నాహాలు మొదలయ్యాయి. పర్లాకిమిడి రాజవీధిలో ఉన్న శ్రీమందిరంలో రథాల తయారీకి కమిటీ సిద్ధమవుతోంది. దీనిలో భాగంగా మంగళవారం ఉదయం రథాల పాత ఇరుసులు, రథ చక్రాలను బయటకు తీశారు. రథయాత్రకు అవసరమయ్యే కొత్త కలప కోసం జిల్లా అటవీ శాఖ అధికారి పి.సుబ్రహ్మణ్యంతో సంప్రదించారు. జూన్ 20వ తేదీ నుంచి ప్రారంభమయ్యే రథయాత్రకు ఇదివరకే కలెక్టరేట్‌లో జిల్లా పాలనాధికారి లింగరాజ్ పండా, ఏడీఎం, సబ్ కలెక్టర్ అలోక్ కుమార్ ప్రధాన్‌తో కమిటీ సభ్యులు సమావేశమయ్యారు.

జయపురం: అవిభక్త కొరాపుట్‌లో ప్రతిష్ఠాత్మకమైన రథయాత్రను అంగరంగ వైభవంగా జరిపేందుకు జయపురం దేవదాయ ధర్మాదాయ విభాగం సబ్ డివిజన్ అధికారులతో సమావేశం నిర్వహించింది. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రథయాత్రను ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. తిథి ప్రకారం జూన్ 20వ తేదీన రథయాత్ర ప్రారంభం కానున్నా, జయపురంలో సాంప్రదాయంగా ఒకరోజు ఆలస్యంగా 21వ తేదీన రథయాత్ర ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆరోజు మధ్యాహ్నం 2 గంటలకు రథాన్ని లాగడం ప్రారంభమవుతుందని, అప్పటినుంచి బహుడ జాత్ర వరకు పట్టణంలో మద్యం అమ్మకాలు నిలిపి వేయాలని నిర్ణయించారు. రథాలపై సహాయకులు 20 నుంచి 25 మంది లోపే ఉండాలని, రథాల తయారీ, మెయిన్ రోడ్డు మరమ్మతులు, ట్రాఫిక్ నియంత్రణ, అధిక మహిళా పోలీసుల ఏర్పాటు, సివిల్ డ్రెస్‌లలో జవానుల ఏర్పాటు, అన్నభోగ ధర నిర్ధారణ, సాంస్కృతిక ప్రదర్శనలు, తాగునీటి సౌకర్యం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నరేంద్ర మహంతి, కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయిక్, జయపురం సబ్ కలెక్టర్ బేదబర ప్రధాన్, జయపురం దేవదాయ ధర్మాదాయ అధికారి, తహసీల్దార్ శుశ్రీ సాగరిక షాడంగి, సబ్ డివిజన్ సమాచార పౌర సంబంధాల అధికారి యశోద గదబ తదితరులు పాల్గొన్నారు.


పర్లాకిమిడి: రథయాత్ర రథాలు సిద్ధం చేస్తున్న దృశ్యం


పర్లాకిమిడి: రథానికి కావాల్సిన ఇరుసులను బయటకు తీసుకొస్తున్న కూలీలు

వేసవి విషాదం

- వేర్వేరు ఘటనల్లో ఇద్దరు విద్యార్థుల మృతి
- చెరువులో మునిగి ఒకరు.. పాముకాటుకు మరొకరు బలి


సవర రమ్య మృతదేహం


మృతి చెందిన రాకేష్

పాతపట్నం: మండలంలోని శోభ పంచాయతీ గులిమిసింగిగూడకు చెందిన తొమ్మిదో తరగతి చదివిన విద్యార్థిని సవర రమ్య(16) మంగళవారం పాము కాటుతో మృతి చెందిందని ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు తెలిపారు. గులిమిసింగిగూడకు చెందిన సవర రమ్య మెళియాపుట్టి మండలం నెలబొంతు గిరిజన ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుకుని వేసవి సెలవులకు స్వగ్రామం గులిమిసింగి గూడ వచ్చింది. వేసవి సెలవులు కావడంతో పెద్దసున్నాపురం పంచాయతీ బంబురుగూడలో ఉంటున్న మేనత్త చిన్నింటి లక్ష్మమ్మ ఇంటికి వెళ్లింది. సోమవారం రాత్రి భోజనం చేసి ఇంట్లో నేలపై పడుకున్నారు. ఇంతలో రమ్యకు పాటు కాటు వేసింది. ఆ విషయం గమనించలేదు. మంగళవారం తెల్లవారుజామున రమ్య లేచి కడుపునొప్పి అని చెప్పడంతో వెంటనే ఆర్ఎంపీ వైద్యుడ్ని సంప్రదించారు. పాటు కాటు వేసిందని చెప్పడంతో వెంటనే ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి పాతపట్నం సీహెచ్‌సీకి తీసుకురాగా చికిత్స పొందుతూ మృతి చెందింది. తండ్రి సవర రాజారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కామేశ్వరరావు తెలిపారు.

స్నానానికి వెళ్లి..

సంతబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం కురుడు గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థి పేరిశెట్టి రాకేష్ (14) చెరువులో జారిపడి మృతి చెందాడు. వేసవి సెలవులు కావడంతో రాకేష్ శివరాంపురంలోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. అక్కడి నుంచి సోమవారం పక్క గ్రామమైన పెద్ద తుంగాంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం స్నానానికి చెరువు వద్దకు వెళ్లగా జారిపడి మునిగిపోయాడు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి సామాజిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి గోవిందరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.

నేడు స్విమ్మింగ్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: బేబీ స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్మింగ్ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షుడు కెఎస్ఎస్‌వీ ప్రసాద్ మంగళవారం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉన్నతాధికారులు హాజరుకానున్నట్లు చెప్పారు. ప్రతీరోజు చిన్నపిల్లలకు బేబీ స్విమ్మింగ్ పూల్‌లో ఉదయం 9 నుంచి మూడు గంటలపాటు శిక్షణ అందిస్తామన్నారు.

ఈ నెల పది నుంచి జూన్ 14 వరకు 34 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు.

వలస విద్యార్థులకు భరోసా



- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చొరవతో స్వగ్రామాలకు మణిపూర్ విద్యార్థులు
- సీఎంపై కృతజ్ఞతల వర్షం
- నాలుగేళ్లలో వందల మందిని కాపాడిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఆపదలో ఉన్న వారికి నేనున్నానంటూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. ఆపన్న హస్తం అందించి మానవత్వం చాటుకుంటున్నారు. రోగమొచ్చినా, కష్టమొచ్చినా అభాగ్యులకు తోడుగా ఉంటున్నారు. ఎవరికి ఏ అపాయం వచ్చినా ఆపద్బాంధవుడిలా సాయం చేస్తున్నారు. బాధితుల కుటుంబాల్లో జీవన జ్యోతులు వెలిగిస్తున్నారు. రోగం వస్తే ఆరోగ్యశ్రీతో ప్రాణాలు కాపాడుతున్నారు. అక్కడితో కాలేదనుకుంటే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆపన్నులను ఆదుకుంటున్నారు. చదవ లేని నిస్సహాయ స్థితిలో ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యా కానుకలతో అలసిన బతుకులకు బాసగా నిలుస్తున్నారు. విపత్తులు, ప్రమాద సమయాల్లో కొట్టుమిట్టాడుతున్న వారికి నేనున్నానంటూ భరోసానిస్తున్నారు. తాజాగా మణిపూర్‌లో చిక్కుకున్న జిల్లా విద్యార్థులను క్షేమంగా ఇంటికి తీసుకొచ్చేలా చొరవ తీసుకున్నారు.

సీఎం చొరవతో జిల్లాకు..

అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి సిక్కోలు జిల్లాలో వేలాది మందిని ఆదుకున్న సందర్భాలున్నాయి. కరోనా సమయంలో ఇతర ప్రాంతాల్లో ఉండిపోయిన వారిని జిల్లాకు తీసుకొచ్చారు. రాష్ట్రం కాని రాష్ట్రంలో, దేశం కాని దేశంలో ఉద్యోగాల కోసం వెళ్లి ఇబ్బంది పడుతుంటే వారి సమస్యలు తీర్చి, సొంతూళ్లకు తీసుకొచ్చిన దాఖలాలు ఉన్నాయి. చదువులు, ఉద్యోగాల కోసం వెళ్లి అక్కడ నెలకున్న అనూహ్య పరిస్థితుల నేపథ్యంలో ఇబ్బంది పడుతుంటే నేనున్నానంటూ అభయమిచ్చి, వారికి భరోసా కల్పించి, ప్రభుత్వ నిధులతో వారిని కన్న ఊరికి తీసుకొచ్చిన ఘనత వైఎస్ జగన్‌దే అని చెప్పవచ్చు. ఇలా చెప్పుకుంటూపోతే ఈ నాలుగేళ్లలో గుర్తుకు తెచ్చే సంఘటనలు ఎన్నో ఉన్నాయి. తాజాగా మణిపూర్‌లో అల్లర్ల నేపథ్యంలో మన జిల్లాకు చెందిన విద్యార్థులు అక్కడ నిట్, సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీలో చదువుతూ, తిండికి ఇబ్బంది పడుతూ, ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవిస్తుంటే.. వారి వద్దకు ప్రభుత్వమే వెళ్లి, సొంత ఖర్చులు పెట్టి విమానాల ద్వారా వారందరినీ జిల్లాకు తీసుకొచ్చారంటే సీఎం చొరవ, మానవత్వం ఎలాంటిదో స్పష్టమవుతోంది. అలాంటి నాయకుడు మనకు దొరకడం, అది కూడా పాలకుడు కావడం మన అదృష్టమని ఆపన్నహస్తం అందుకున్న వారంతా ముక్తకంఠంతో చెబుతున్నారు.


సర్కారు చొరవ అభినందనీయం



ఏపీ ప్రభుత్వం ప్రత్యేక ఫ్లైట్స్‌ను ఏర్పాటు చేసి మమ్మల్ని స్వస్థలాలకు తీసుకురావడం చాలా సంతోషంగా ఉంది. నేను ఎలక్ట్రికల్ విభాగంలో పీహెచ్‌డీ స్కాలర్ చేస్తున్నాను. మణిపూర్‌లో రెండు వర్గాల మధ్య తలెత్తిన విభేదాల కారణంగా అల్లర్లు చెలరేగాయి. ఈ సమయంలో ఏపీ ప్రభుత్వం చొరవ తీసుకుని స్పెషల్ ఫోర్స్, సెంట్రల్ ఫోర్స్ సహాయంతో మమ్మల్ని ప్రత్యేక విమానాల్లో హైదరాబాద్‌కు తరలించింది. అక్కడి నుంచి ట్రైన్‌లో శ్రీకాకుళం చేరుకున్నాం.

– బి.అనిల్ కుమార్, పెదపాడు, శ్రీకాకుళం

రోజుకు లీటరు నీరే..




'మా కాలేజీ సమీపంలోనే పేలుళ్లు జరిగేవి. కనీసం వాష్‌రూమ్‌కు వెళ్లేందుకు కూడా ఇబ్బందికర పరిస్థితులుండేవి. ప్రతిరోజూ కప్పు అన్నం, పప్పుతో సరిపెట్టుకున్నాం. క్షణమొక యుగంగా గడపాల్సి వచ్చింది. నా క్షేమ సమాచారం కోసం తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, పద్మావతి తల్లడిల్లిపోయారు. అక్కడి పరిస్థితులను టీవీల ద్వారా తెలుసుకొని బాధపడ్డారు. చివరకు ఏపీ ప్రభుత్వం చొరవతో బయటపడ్డాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– స్నేహిత్, ఎన్ఐటీ విద్యార్థి, కొండరాగోలు, హిరమండలం

ప్రభుత్వానికి ధన్యవాదాలు

మాపై ఏపీ ప్రభుత్వం చూపిన ప్రేమాభిమానాలు ఎప్పటికీ మర్చిపోలేం. ఇంఫాల్‌లో అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఎకనామిక్స్ సెకెండియర్ చేస్తున్నాను. మణిపూర్‌లో పరిస్థితులు భయానకంగా మారడంతో అక్కడి యూనివర్సిటీ ప్రతినిధులు మమ్మల్ని అప్రమత్తం చేశారు. ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విమానాల్లో హైదరాబాద్ చేరుకున్నాం.

–తనూజా, ఎస్ఎస్‌వలస



జిల్లా వాసులను ఆదుకున్న సందర్భాలివి..




- 2018 నవంబర్ 27న పాకిస్తాన్ భద్రతా దళాలకు వీరావల్‌లో సముద్రవేటలో మన జిల్లాకు చెందిన మత్స్యకారులు పట్టుబడ్డారు. దాదాపు 20 మంది పాకిస్తాన్ కరాచీ జైలులో గడిపారు. వారి విడుదల కోసం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పెద్దగా ప్రయత్నించలేదు. అధికారంలోకి వచ్చాక వైఎస్ జగన్ ప్రభుత్వం పలుమార్లు కేంద్రంతో సంప్రదింపులు జరిపింది. ఎంపీలు విజయసాయిరెడ్డి, బెల్లాన చంద్రశేఖర్ విదేశాంగ మంత్రితో మాట్లాడి, 2020 జనవరి 6న వారందరినీ విడుదల చేయించి సొంత ఊర్లకు తీసుకొచ్చారు.



- కరోనా వైరస్ వ్యాప్తి కట్టడి కోసం కేంద్రం లాక్‌డౌన్ అమలు చేసినప్పుడు జిల్లాకు చెందిన మత్స్యకారులు గుజరాత్, చెన్నై తదితర ప్రాంతాల్లో చిక్కుకున్నప్పుడు వైఎస్ జగన్ ప్రభుత్వం చొరవ తీసుకుని రూ.3 కోట్లు ఖర్చు పెట్టి జిల్లాకు చెందిన 3064 మంది మత్స్యకారులను 46 బస్సుల ద్వారా వారి ఊర్లకు తీసుకొచ్చింది.



- వజ్రపుకొత్తూరు, పలాస, టెక్కలి, ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి తదితర ప్రాంతాల నుంచి మలేషియా, గల్ఫ్ దేశాలకు ఉపాధి పనుల కోసం వలస వెళ్లి ఏజెంట్ల చేత మోసపోయి, దిక్కుతోచని స్థితిలో బాధితులు ఉన్న విషయాన్ని తెలుసుకుని మంత్రి సీదిరి అప్పలరాజు సకాలంలో స్పందించి, సీఎంతో మాట్లాడి, కేంద్రంతో సంప్రదింపులు జరిపి, వారందరినీ క్షేమంగా ఊళ్లకొచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.
- సింధు నది పుష్కరాలకు జిల్లాలోని సోంపేట, నరసన్నపేట, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాల నుంచి వెళ్లిన యాత్రికులు ట్రావెల్ ఏజెన్సీ నిర్వాకంతో ఇబ్బందులు పడగా సీఎంఓ అధికారులు సకాలంలో స్పందించారు. ఇబ్బందులు పడ్డ వారి ఇక్కట్లను తీర్చారు. సరిపడా డబ్బులు ఇవ్వలేదని ట్రావెల్ ఏజెన్సీ ఓ గదిలో పెట్టి నిర్బంధించగా, బాధితులు సెల్ఫీ వీడియో ద్వారా ఆర్తనాదాలు పెట్టగా, వైఎస్ జగన్ ప్రభుత్వం వెంటనే స్పందించి కేంద్ర హోం మంత్రిత్వ శాఖతో మాట్లాడి నిర్బంధంలో ఉన్న వారందరినీ విడిచి పెట్టేలా చేసింది.
- రష్యా దాడుల నేపథ్యంలో ఉక్రెయిన్‌లో వైద్య, ఇతర కోర్సులు, ఉద్యోగాల కోసం వెళ్లిన జిల్లాకు చెందిన 20 మంది ఇబ్బందులు పడుతుంటే.. వెంటనే సీఎం జగన్ ప్రభుత్వం స్పందించి, కేంద్ర విదేశాంగ మంత్రితో మాట్లాడి, వారందరినీ సొంతిళ్లకు క్షేమంగా వచ్చేలా చర్యలు తీసుకుంది.



- టర్కీ భూకంప సమయంలో కూడా వైఎస్ జగన్ ప్రభుత్వం తక్షణమే స్పందించింది. పలాస, కంచిలి, కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం, సంతబొమ్మాళి మండలాలకు చెందిన వారంతా అక్కడ చిక్కుకుని ఇబ్బంది పడుతుంటే, వారి యోగక్షేమాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వారి కుటుంబీకులకు తెలియజేసి, బాధితులకు ఏం అవసరమో తెలుసుకుని, తగు అవసరాలను తీర్చింది.



- తాజాగా మణిపూర్‌లో అల్లర్లు చెలరేగడంతో కర్ఫ్యూ విధించిన నేపథ్యంలో మన జిల్లాకు చెందిన విద్యార్థులు 10మందికి పైగా అక్కడ ఇబ్బంది పడ్డారు. మన జిల్లాకు చెందిన వారే కాకుండా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల విద్యార్థులు కూడా తుపాకులు, బాంబుల మోతలతో నిద్రలేని రాత్రులు గడపడమే కాకుండా తిండి, నీరు లేని పరిస్థితిలో భయాందోళనకు గురయ్యారు. ముఖ్యంగా సెంట్రల్ అగ్రికల్చర్ యూనివర్సిటీ, నిట్‌లో చదివిన పిల్లలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతుకు జీవుడా గడిపిన పరిస్థితి ఏర్పడింది. పరిస్థితిని గమనించిన వైఎస్ జగన్ ప్రభుత్వం సకాలంలో స్పందించి, సొంత నిధులతో విమానాలు ఏర్పాటు చేసి, వారందరినీ సొంత ఊళ్లకు తీసుకొచ్చింది.

సీం స్పందించిన తీరు అద్భుతం




మణిపూర్‌లో రెండు వర్గాల మధ్య చెలరేగిన అల్లర్లతో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. దీంతో తీవ్ర భయాందోళనల నడుమ గడిపాం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరితగతిన స్పందించి విద్యార్థులకు ఏమీ కాకుండా అన్ని చర్యలు తీసుకుంది. ప్రభుత్వమే బాధ్యత తీసుకుని అన్ని ఖర్చులను భరించి విమానంలో మమ్మల్ని క్షేమంగా ఇంటికి చేరేలా చర్యలు చేపట్టడం అభినందనీయం. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– కె.అక్షయ్, బీటెక్ తృతీయ సంవత్సరం, శ్రీకాకుళం

ఐఏఎల్ సభ్యునికి సన్మానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా ఏకగ్రీవంగా నియమితులైన కూన అన్నంనాయుడును మంగళవారం శ్రీకాకుళం న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆగూరి ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావులు ఘనంగా సత్కరించారు. మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.


కూన అన్నంనాయుడును సత్కరించిన దృశ్యం

వైభవంగా సిరిమానోత్సవం

జలుమూరు: మండల కేంద్రం జలుమూరులో మూడు రోజులుగా జరుగుతున్న ఆదిలక్ష్మీ అమ్మవారి సంబరాల్లో భాగంగా మంగళవారం సిరిమాను ఉత్సవం అంబరాన్ని తాకింది. తొలుత అమ్మవారి చెట్టు(రావి) వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళవాయిద్యాల నడుమ సిరిమానుకు పసుపు, కుంకమ పూజలు చేసి ముగ్రాటలతో అభిషేకించారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తొలి కొబ్బరికాయ కొట్టి సిరిమానుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వంశపారంపర్య ధర్మకర్తలు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఉజ్జిడి, శిరిమానును తిరువీధి నిర్వహిస్తుండగా భక్తులు దర్శించుకున్నారు.


సిరిమానుతో తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

అంబరాన్నంటిన సంబరం



ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం చింతామణి అమ్మవారి సంబరాలు మంగళవారం అంబరాన్నంటాయి. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్దను మేళతాళాలతో బాణసంచా కాలుస్తూ యువత నృత్యాలు చేస్తూ ఊరేగించారు. -కవిటి

ఆదిత్యుని సన్నిధిలో హాస్యనటులు

అరసవల్లి సూర్యనారాయణ స్వామిని బుల్లితెర హాస్యనటుడు, జబర్దస్త్ ఫేం ఆటో రామ్‌ప్రసాద్, బిగ్‌బాస్ ఫేం శ్వేతావర్మ, యాంకర్ అంకిత మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు గౌరవ స్వాగతం పలికారు. – అరసవల్లి



విత్తనం.. సీసాలో భద్రం



మురగడలోవ గ్రామానికి చెందిన గిరిజనులు విత్తనాలు దాచుకునేందుకు సరికొత్త పద్ధతిని అవలంబించారు. ఖాళీ డ్రింక్ బాటిళ్లు, ఇతర ప్లాస్టిక్ సీసాల్లో అపరాలైన పెసలు, మినుము, కంది వంటి విత్తనాలను భద్రపరుస్తున్నారు. ఇలా చేయడం వల్ల ఏడాది వరకు విత్తనాలకు పురుగు పట్టదని చెబుతున్నారు. – ఎల్.ఎన్.పేట

వైభవంగా వసంతోత్సవం

వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ వాసుదేవునికి వసంతోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారిని నిజరూపుని గావించి క్షీర, మకరంద, పసుపు జలాలతో అభిషేకం చేశారు. ఆలయం పునః ప్రతిష్ఠ జరిగి 14 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వసంతోత్సవం నిర్వహించినట్లు ప్రధానార్చకులు కూర్మాచార్యులు చెప్పారు. – మందస



మండుటెండలో..



ఎండలు మండుతున్నాయి. బయటకు రావాలంటేనే ఒకటికిరెండు సార్లు ఆలోచించాల్సిన పరిస్థితి. అలాంటిది పసిపిల్లలతో కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద కొందరు యాచకత్వం చేయిస్తున్నారు. నెలల వయసున్న పిల్లలను మహిళలు పట్టుకుని గేటు వద్ద ఆగే బస్సుల్లోకి వెళ్లి యాచిస్తున్నారు. – కాశీబుగ్గ

క్లుప్తంగా

వ్యాన్ బోల్తా: 15 మందికి గాయాలు



గాయపడిన వ్యక్తికి భద్రగిరి సీహెచ్‌సీలో వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పెద్దగూడ గ్రామ సమీపంలో వ్యాన్ బోల్తాపడడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈమేరకు ఎలి్వన్‌పేట ఎస్సై ఎస్.షణ్ముఖరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కల్లటి గ్రామానికి చెందిన 15 మంది నిగరాం గ్రామంలో మంగళవారం శుభకార్యానికి హాజరయ్యేందుకు వ్యాన్‌లో బయల్దేరారు. మార్గమధ్యంలోని పెద్దగూడ సమీపంలో వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆరిక బాబూరావు, సీమల నీలమ్మ, సిరిమంతి, అరుణ్, ఆరిక అర్జున్, సీమల చంద్రయ్య, ఆరిక మనోజ్, కృష్ణారావు, సీమన్నలతో పాటు డ్రైవర్ సీమల వసంత్‌లకు కొద్దిపాటి గాయాలయ్యాయి. క్షతగాత్రులను తక్షణమే భద్రగిరి సీహెచ్‌సీకి తరలించగా వైద్యులు చికిత్స అందించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్ వద్ద ఎస్ఈబీ అధికారులు

సంతకవిటి: మండలంలోని నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం శంఖరుని అగ్రహారం వద్ద స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బి.శ్రీధర్, ఎస్సై పిచ్చేశ్వరరావులు పట్టుకుని సీజ్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.లోకేశ్వరరావు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న బోడియమ్మ

పార్వతీపురం: భర్త చనిపోతానని బెదిరిస్తుండడంతో మనస్తాపం చెందిన భార్య పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మంగళవారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం బల్లపాడు గ్రామానికి చెందిన పి.బోడియమ్మ భర్త సింగ్ నిత్యం మద్యం తాగి వచ్చి చనిపోతానని భార్యాపిల్లలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. భర్త చనిపోతే పిల్లలు అనాథలైపోతారని భావించిన భార్య మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగు మందును తాగేసింది. విషయాన్ని గమనించిన భర్త ఆటోలో చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించాడు.

చెట్టుపై గీత కార్మికుడి మృతి



కొబ్బరిచెట్టుపై విగతజీవిగా వేలాడుతున్న రాములప్పన్న

విజయనగరం క్రైమ్: కొబ్బరి కొమ్మలు కొట్టేందుకు చెట్టు ఎక్కిన వ్యక్తి ఆ చెట్టుకే వేలాడుతూ విగతజీవిగా మారాడు. మంగళవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి టూటౌన్ పోలీసులు అందజేసిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక పద్మావతినగర్‌లో నివాసం ఉంటున్న కణపాకకు చెందిన అంగటి రాములప్పన్న (63) గీత కార్మికుడు. పద్మావతినగర్‌లో కొబ్బరి కొమ్మలు కొట్టేందుకు చెట్టు ఎక్కాడు. కొమ్మ కొట్టే క్రమంలో ఒక కొమ్మ పక్కనే ఉన్న విద్యుత్ వైర్లపై పడింది. దాన్ని చెట్టుపై నుంచి లాగేందుకు ప్రయత్నించే క్రమంలో షాక్ తగలడంతో మృతిచెంది చెట్టుకు వేలాడాడు. వెంటనే స్పందించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. హుటాహుటిన టూటౌన్ ఎస్సై షేక్ శంకర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాదక ద్రవ్యాల రవాణా అడ్డగింతకు తనిఖీలు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో మాదకద్రవ్యాల రవాణా, అమ్మకాలకు అడ్డుకట్టవేసేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లా సరిహద్దు గ్రామాలు, మారుమూల ప్రాంతాల్లోని ముఖ్యమైన ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించాలని పోలీసు అధికారులకు సూచించినట్లు చెప్పారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలను పూర్తిస్థాయిలో అరికట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువతను లక్ష్యంగా చేసుకుని మాదకద్రవ్యాలు విక్రయిస్తుంటారని, సారా, గంజాయి విక్రయించిన ప్రాంతాలపైన, వ్యక్తులపైన నిఘా పెట్టామని చెప్పారు. మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలపై ఎటువంటి సమాచారం ఉన్నా ప్రజలు పోలీసు సిబ్బందికి తెలియజేయాలని కోరారు. సమాచారం తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

వేసవి శిబిరాలతో క్రీడా వికాసం



క్రీడా శిబిరాల నిర్వహణకు అవసరమైన కిట్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్, ఎంపీ తదితరులు

- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- ప్రారంభమైన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

విజయనగరం: మానసిక శారీరక వికాసం కోసం క్రీడలు దోహదపడతాయని, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకుని అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సూచించారు. వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రాన్ని క్రీడాపరంగా కూడా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్రీడా శిక్షణ కార్యక్రమాన్ని ఉపయోగించుకుని, నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు కేవలం చదువుపైనే కాకుండా ఆటలపైనా దృష్టి సారించాలని చెప్పారు. క్రీడల ద్వారా విద్య, ఉద్యోగాలు కూడా సాధించవచ్చన్నారు.

యువతకు శిక్షణ ఇచ్చేందుకు జెడ్పీ నిధులు

జిల్లాపరిషత్ చైర్మన మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, క్రీడారంగానికి ముఖ్యమంత్రి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. దీనిలో భాగంగా క్రీడా శిబిరాలను నిర్వహించడమే కాకుండా, స్పోర్ట్స్ కిట్లను కూడా అందిస్తున్నామని, ఇందుకోసం ఒక్కో శిబిరానికి రూ.7వేలు చొప్పున నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు

క్రీడారంగంలో జిల్లాకు ఘనచరిత్ర

ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ, క్రీడారంగంలో జిల్లాకు ఎంతో ఘన చరిత్ర ఉందని, ఇక్కడి క్రీడాకారులు దేశవిదేశాల్లో ఎంతో పేరుప్రఖ్యాతులు సాధించారని చెప్పారు. సెట్విజ్ సీఈఓ రాంగోపాల్ మాట్లాడుతూ, వేసవి క్రీడా శిక్షణ కార్యక్రమాన్ని వివరించారు. కబడ్డీ, ఖోఖో, హ్యాండ్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, తైక్వాండో, కుస్తీ, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, ఫెన్సింగ్ తదితర క్రీడాంశాల్లో ఈనెల 1 నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా 50 శిబిరాల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములు జిల్లా ప్రధాన శిక్షకులు రాజగోపాల్, బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మన్మథరావు, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు కేవీ సూర్యనారాయణ రాజు, తైక్వాండో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ చారి ప్రసాద్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కాళ్ల సూరిబాబు, ఫెన్సింగ్ కోచ్ ఎం.సతీష్‌కుమార్, బాక్సింగ్ కోచ్ బి.ఈశ్వరరావు, పలువురు కోచ్‌లు, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



బాక్సింగ్ శిబిరం ప్రారంభోత్సవంలో తలపడుతున్న బాలికలు

క్రీడాకారులకు సంపూర్ణ సహకారం



సీఎం కప్ ఫుట్‌బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా జట్టును అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- సీఎం కప్ ఫుట్‌బాల్ విజేతలను అభినందించిన కోలగట్ల

విజయనగరం: క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. 33 సంవత్సరాల తర్వాత ఫుట్‌బాల్ క్రీడాంశంలో విజయనగరం జిల్లా జట్టు రాష్ట్రస్థాయిలో విజయకేతనం ఎగురవేయడం గర్వించదగిన విషయమన్నారు. తిరుపతి జిల్లాలో ఇటీవల జరిగిన సీఎం కప్– 2023 ఫుట్‌బాల్ ఫైనల్స్‌లో విజయనగరం జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులు.. అసోసియేషన్ చైర్మన్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయన చేతుల మీదుగా కప్పును అందుకున్నారు. అనంతరం వారిని కోలగట్ల అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని, విజయనగరం ఖ్యాతిని నలుదిశలా చాటాలని సూచించారు. క్రీడాకారులకు ఏ అవసరం వచ్చినా తాను పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కోలగట్ల ప్రోత్సాహం, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సహకారం వల్లే తాము రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపి విజేతలుగా నిలవగలిగామని ఈ సందర్భంగా క్రీడాకారులు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ తరఫున కోలగట్లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు దర్భపూడి రజినీ కుమార్, ఉపాధ్యక్షుడు డి.చిట్టి, కార్యదర్శి, 19వ డివిజన్ కార్పొరేటర్ పి.శ్రీనివాసరావు, కోశాధికారి ఎస్.బి.ఎస్ రాజేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

11న సబ్ జూనియర్ వాలీబాల్ జట్టు ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్‌జూనియర్స్ బాల, బాలికల వాలీబాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక ఈనెల 11న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీఏఎస్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పోటీల్లో ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలను మాత్రమే ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 2007 జనవరి 10వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు మాత్రమే పోటీల్లో పాల్గొనేందుకు అర్హులుగా స్పష్టం చేశారు. ఆ రోజు జిల్లా జట్టుకు అర్హత సాధించిన క్రీడాకారులు ఈనెల 14 నుంచి రాజమండ్రిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని, అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అ'పూర్వ'ఘట్టం

- ఐదు దశాబ్దాల అనంతరం ఆత్మీయ కలయిక
- మధురస్మృతులను నెమరువేసుకున్న 1972–73 విద్యార్థులు
- ప్రధానోపాధ్యాయుడికి ఘనంగా సన్మానం



పూర్వ ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): వారంతా ఐదు దశాబ్దాల క్రితం గరివిడి మండలంలోని తోండ్రంగి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్నారు. పాఠశాల చదువుల అనంతరం ఉన్నత చదువులు పూర్తి చేసుకుని ఎక్కడెక్కడో స్థిరపడిన వారు కొంత మందైతే, సొంత గ్రామాల్లో వ్యవసాయం, వ్యాపారాల్లో స్థిరపడిన వారు మరికొంత మంది. జీవితాల్లో స్థిరపడి వివాహాల అనంతరం వారి పిల్లలకు పెళ్లిళ్లు చేసి మనుమలను ఎత్తుకునే ఆరు దశాబ్దాల పైబడిన వయసులో వారంతా ఒకచోట కలవాలనుకున్నారు. ఈ కలయికకు తాము చదువుకున్న పాఠశాలనే వేదికగా ఏర్పాటు చేసుకుని మధుర జ్ఞాపకాలను నెమరువేసు కోవాలను కున్నారు. ఈ మేరకు వారు చదువుకున్న ఉన్నత పాఠశాలలోనే మంగళ వారం జరిగిన ఆత్మీయ కలయికలో భాగస్వాములయ్యారు. అప్పుడెప్పుడో చదువుకున్న వారంతా ఒక్కసారిగా కలవడంతో ఒకరినొకరు హత్తుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారు చదువుకున్నప్పుడు చేసిన అల్లర్లు, ఆటలు పాటలు తదితర తీపి గుర్తులను మరోసారి జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఈ ఆత్మీయ కలయికలో భాగంగా తమకు చదువు చెప్పిన ప్రధానోపాధ్యాయుడు అరవెల్లి కృష్ణమూర్తిని ఘనంగా సన్మానించి ఆయన దీవెనెలు అందుకున్నారు.

జలజీవన్ మిషన్ పనులు వేగవంతం చేయండి



సమీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

- రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి: ఇంటింటికి తాగునీటి కుళాయి అందించడంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన జల జీవన్ మిషన్ పథకం పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, నాలుగు మండలాల ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా తొలి విడతలో ఎన్ని గ్రామాల్లో పనులు జరిగాయి? ఇంకా ఎన్ని గ్రామాల్లో జరగాల్సి ఉంది? రెండో విడతలో ఎన్ని గ్రామాలు పూర్తి చేయాల్సి ఉందనే అంశాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి అందించే బృహత్తర కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉందన్నారు. అన్ని గ్రామాల్లోనూ పైప్‌లైన్ పనులు పూర్తి చేసి ఇంటింటికి కుళాయిలు ఇవ్వాలని స్పష్టం చేశారు.

ఆర్డీఓ, డీఎస్పీ కార్యాలయాలకు స్థలం సిద్ధం చేయాలి

అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఆర్‌డీఓ, డీఎస్పీ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని త్వరితగతిన సిద్ధం చేయాలని ఆర్‌డీఓ ఎం.అప్పారావుకు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ సూచించారు. రెండు కార్యాలయాలకు స్థలం సిద్ధం చేస్తే తక్షణమే ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని చెప్పారు. అదేవిధంగా సీహెచ్‌సీలో మోడరన్ పోస్ట్‌మార్టం గది నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్, చీపురుపల్లి ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, చీపురుపల్లి, గుర్ల, గరివిడి జెడ్పీటీసీలు వలిరెడ్డి శిరీష, శీర అప్పలనాయుడు, వాకాడ శ్రీనివాసరావు, ఆర్‌డీఓ ఎం.అప్పారావు, నాలుగు మండలాల ఎంపీడీఓలు కె.రామకృష్ణరాజు, జి.భాస్కరరావు, రామకృష్ణ, కల్యాణి, తహసీల్దార్ ఎం.సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు కేవీ.సూర్యనారాయణరాజు, ఎస్‌వీ.రమణరాజు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల విశ్వేశ్వరరావు, కోట్ల వెంకటరావు, తాడ్డి వేణు, బూర్లె నరేష్, పొట్నూరు సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన గంగప్పడు

గజపతినగరం: బొండపల్లి మండలం తమటాడ గ్రామానికి చెందిన గొలగాన గంగప్పడు(35) అదృశ్యమైనట్లు భార్య సంతోషి మంగళవారం రాత్రి గజపతినగరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఏఎస్సై మూర్తి కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భార్యను తీసుకువెళ్లేందుకు మూడురోజుల క్రితం గజపతినగరం మండలం రంగుపురం గ్రామంలోని అత్తవారింటికి గంగప్పడు వచ్చాడు. తాను రెండు రోజుల్లో వస్తానని భార్య చెప్పడంతో వెళ్లిపోయిన గంగప్పడు నేటికీ ఇంటికి చేరకపోవడంతో భార్య ఫిర్యాదు చేసింది.

10 కేజీల గంజాయితో ముగ్గురి అరెస్ట్



గంజాయి నిందితులను హాజరుపరిచిన సీఐ బాలసూర్యారావు

కొత్తవలస: అరకులో గంజాయి కొనుగోలు చేసి ఢిల్లీ తరలిస్తుండగా కొత్తవలస పోలీసులు ముగ్గురు నిందితులు పట్టుబడ్డారు. ఈ ఘటనకు సంబంధించి సీఐ ఎస్.బాలసూర్యారావు మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నార్త్ ఢిల్లీకి చెందిన బాబిదేవి, అనురాగ్‌కుమార్, ఎ.కుష్వాలు అరకులో 10 కేజీ గంజాయిని కొనుగోలు చేసి ఆర్‌టీసీ బస్సులో విశాఖపట్నం తరలిస్తున్నారు. ఈ క్రమంలో తుమ్మికాపల్లి ఫ్లైఓవర్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆర్‌టీసీ బస్సులోంచి ముగ్గురు వ్యక్తులు పరారయ్యేందుకు యత్నించారు. దీంతో పోలీసులు అప్రమత్తమై వారిని పట్టుకుని క్షుణంగా తనిఖీ చేయగా గంజాయి విషయం బయటపడింది. దీంతో పరారయ్యేందుకు ప్రయత్నించిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ముందు నిందితులను హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.కార్యక్రమంలో ఎస్సై బి.దేవి,కానిస్టేబుల్స్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

పార్వతీపురం మన్యం జిల్లాలో మంగళవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. క్షతగాత్రులంతా పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు ఆస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. – పార్వతీపురం

సీతానగరం మండలం చినభోగిలి గ్రామానికి చెందిన బి.పాపమ్మ చినభోగిలి బస్టాండ్ నుంచి ఇంటికి రైల్వే గేటు మీదుగా వెళ్తున్న తరుణంలో వెనుక నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొట్టడంతో కుడికాలిపై పలు చోట్ల గాయాలయ్యాయి. స్థానికులు ఆటోలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కారును బైక్ ఢీకొని దంపతులకు..

పార్వతీపురం మండలం నర్సిపురం పంచాయతీ విశ్వంబరపురం గ్రామానికి చెందిన కె.గౌరి పార్వతీపురం నుంచి నర్సిపురం మీదుగా ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న సమయంలో నర్సిపురం గ్రామం సమీపంలో కారు సడన్‌గా తిప్పడంతో కారును ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్రవాహనం నడుపుతున్న గౌరి, భార్య గౌరమ్మలకు పలు చోట్ల గాయాలయ్యాయి. దంపతులను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తికి..

కురుపాం మండలం పొలంగూడ గ్రామానికి చెందిన బి.భాస్కరరావు తన స్నేహితుడు బి.మురళితో కలిసి మొండెంఖల్ గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా బారామని జంక్షన్ సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో భాస్కరరావుకు పలు చోట్ల గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ను బొలెరో ఢీకొని ముగ్గురికి..

పార్వతీపురం పట్టణంలోని రెల్లివీధికి చెందిన ఎస్.కిరణ్, స్నేహితులు పవన్‌కుమార్, జయేంద్రలు కొత్తవలస నుంచి పట్టణంలోనికి ద్విచక్రవాహనంపై వస్తున్న సమయంలో ఫ్లైఓవర్ వద్ద ముందుగా వెళ్తున్న బొలెరో అకస్మాత్తుగా టర్న్ అయి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న ముగ్గురికి పలు చోట్ల గాయాలయ్యాయి.

520 కిలోల గంజాయి స్వాధీనం

- దాని విలువ రూ.కోటి ఉంటుందని అంచనా



పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎస్.కోట పోలీసులు

శృంగవరపుకోట: ఎస్.కోట పోలీసులు రూ.కోటి విలువచేసే 520 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను సీఐ సింహాద్రినాయుడు వెల్లడించారు. బొడ్డారా కూడలిలో పోలీసులు మంగళవారం ఉదయం వాహన తనిఖీలు జరిపారు. అనుమానంతో అరకు నుంచి విశాఖవస్తున్న టాటా ఏస్ వాహనాన్ని ఆపారు. గంజాయి స్మగ్లర్లు వాహనంతో పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. తహసీల్దార్ శ్రీనివాసరావు సమక్షంలో వాహనాన్ని సోదా చేయగా 520 కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయితో పట్టుబడిన వ్యక్తులు ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కై రీపుట్ గ్రామానికి చెందిన కృష్ణహంతల్, ముంచంగిపుట్ జిల్లా కులాబెరు గ్రామానికి చెందిన కిముడు సోనాధర్‌గా గుర్తించారు. వీరిద్దరు రూ.15 లక్షలకు అరకులో గంజాయి కొనుగోలు చేశారని, ఎస్.కోట శివారు వరకు తీసుకొచ్చి వాహనంతో పాటూ సరుకును అప్పగించేందుకు ఒప్పందం చేసుకున్నారు. అక్కడి నుంచి మరొక వ్యక్తి సరుకును తీసుకెళ్తారని పోలీసుల ప్రాథమిక విచారణలో చెప్పారు. ప్రస్తుతం నిందితులను అదుపులోకి తీసుకుని, వాహనాన్ని సీజ్ చేశామని, కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు. మీడియా సమావేశంలో ఎస్.కోట ఎస్ఐ తారకేశ్వరరావు, పోలీస్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నేడు ఆన్‌లైన్ పరీక్ష

పార్వతీపురంటౌన్: పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉదయం 10గంటలకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, హెచ్‌సీఎల్ టెక్నాలజీ సంయుక్తంగా టెక్‌బీ ప్రోగ్రామ్‌కు ఎంపిక చేసేందుకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కిల్‌డెవలెప్‌మెంట్ అధికారి యు.సాయికుమార్, డీవీఈఓ మంజులావీణ మంగళవారం తెలిపారు. ఇంటర్మీడియట్‌లో 2021–22లో 60శాతం, 2022–23లో 75శాతం మార్కులు సాధించిన వారు ఈ పరీక్షకు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9182398325 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

హోరాహోరీగా కుస్తీ ఎంపిక పోటీలు



జిల్లాస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామంలో అండర్–15 జిల్లా స్థాయి కుస్తీ ఎంపిక పోటీలు మంగళవారం హోరాహోరీగా సాగాయి. ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. బాలికల విభాగంలో అనూష, పావని, రిషిత, భవాని, లిఖిత, బాలుర విభాగంలో చరణ్, శరత్, గౌరి శంకర్, కిరణ్, సురేష్, రామచరణ్ ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు చిత్తూరు జిల్లాలో ఈ నెల 13, 14 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

'సెటిల్' సర్వీస్ కుదరదిక..!

- వైద్యసిబ్బంది స్థానికంగా ఉండాల్సిందే
- జూన్ 1 నుంచి అమలు
- ఆదేశాలు జారీ చేసిన కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్



గంట్యాడ మండలం పెదవేమలిలో వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న ఏఎన్ఎం

విజయనగరం ఫోర్ట్: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముఖ్యంగా అన్ని వేళలా ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తోంది. వైద్యం అందలేదని ఏ ఒక్కరూ అనకూడదనే ఉద్దేశంతో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచేవిధంగా చర్యలు చేపట్టింది. గ్రామస్థాయిలో పనిచేసే వైద్యసిబ్బంది అందరూ ఇకపై పనిచేసే చోట నివాసం ఉండేవిధంగా వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో పనిచేసే ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు దూరప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి సమయంలో ఏదైనా సమస్య వస్తే ప్రజలు పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఇటువంటి పరిస్థితులు ఇకపై తప్పనున్నాయి.

24 గంటలు వైద్య సేవలకు హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు

గ్రామీణ ప్రాంత ప్రజలకు 24 గంటల పాటు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రతి సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసింది. సచివాలయం పరిధిలోని గ్రామీణ ప్రజలకు ఏ సమస్య వచ్చినా విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేశారు. జలుబు, దగ్గు, జ్వరం, గాయాలైన వారికి, గర్భిణులకు సాధారణ ప్రసవం, బీపీ, సుగర్ పరీక్షలు చేయడం అవసరమైన వారికి మందులు వంటి సేవలు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అందించాలన్నది లక్ష్యం.అయితే ప్రస్తుతం విలేజ్ హెల్త్ క్లినిక్‌కోసం నియమించిన వైద్య సిబ్బంది జిల్లా కేంద్రం, మండల కేంద్రం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దీని వల్ల గ్రామీణ ప్రజలకు అందాల్సిన వైద్య సేవలు అందడం లేదు. సాయంత్రం 5 గంటల కల్లా వైద్య సిబ్బంది వెళ్లిపోతున్నారు. ఆ తర్వాత ఏ అవసరం వచ్చినా దూర ప్రాంతంలో ఉన్న ఆస్పత్రులకు వెళ్తున్నారు.

జారీ అయిన ఆదేశాలు

గ్రామస్థాయిలో పనిచేసే ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవెడర్)లు పనిచేసే చోట నివాసం ఉండాలని కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు వారు నివసించే చిరునామాలను వైద్యారోగ్య శాఖ అధికారులు సేకరిస్తున్నారు. జిల్లాలో ఏఎన్ఎంలు 500 మంది, ఆశకార్యకర్తలు 1,790 మంది, ఎంఎల్‌హెచ్‌పీలు 499 మంది పనిచేస్తున్నారు. వారంతా ఇకపై స్థానికంగా ఉండాల్సిందే. జూన్ ఒకటో తేదీ నుంచి ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేయనున్నారు.

పని చేసే చోట ఉండాల్సిందే



గ్రామస్థాయిలో పనిచేసే వైద్య సిబ్బంది స్థానికంగా ఉండాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవెడర్లు పనిచేసే చోట నివాసం ఉండాలని స్పష్టం చేశాం.

– డాక్టర్ ఎస్వీ రమణకుమారి, డీఎంహెచ్ఓ